


# ఓడిపోయిన మనిషి

ఆదివారం సెలవురోజు - శరీరానికి; మరి మనస్సుకు సెలవెప్పుడో? జీవితం వెరైటీకోసం ఏడుస్తుంది. ఎన్ని ఆదివారాలు ఇలా గడిచిపోలేదు నిస్సారంగా. కాని ఆదివారం గడిచిపోయింతరువాత మళ్ళా ఆదివారం - సెలవురోజు కావాలనిపిస్తూనే వుంటుంది జీవితానికి.

నిద్రలేచి టైముచూచాను. అబ్బో చీకటిపడడానికి చాలా టైముంది. అంతవరకూ కళ్లు తెరుచుకొని కప్పువంక చూస్తూ వెల్లకిలా పడుకొని వుండలేను. మునిస్వామి దగ్గరికి వెళితే ఏ మేటనీకైనా పోయిరావచ్చు. అయస్కాంతాల ఏకోత్తర ధృవాలు వికర్షిస్తాయి. కాని మానవేకోత్తర ధృవాలు ఆకర్షిస్తాయి. మనకు సరిపోయిన తత్వంగల మనుష్యులతోనే మనమెప్పుడూ స్నేహం చేయాలనిచూస్తాం! ఇంచుమించు మునిస్వామితత్వమూ నాతత్వమూ ఒకమాదిరివే. కాని జీవితరహదార్లు మారడం సహజం! బట్టలు మార్చుకొని బయలుదేరాను మునిస్వామి దగ్గరికి. ఆదర్శశూన్యజీవితానికి ఆహ్లాదం కలిగిస్తే- ఉపశమనం కలుగుతుందేమోనని ఆశ! మునిస్వామి గదితలుపు తీసేవుంది. వ్రాయడు ముందు కుర్చీలో కూర్చుని ఉత్తరం గాబోలు కీన్‌గాచదువుతున్నాడు.

"హలోయ్, నేనువచ్చాను - కృష్ణమూర్తిని" నావిషయం నానోటితో నేనే చెప్పుకోవలసిన స్థితి పట్టింది మరి మునిస్వామిని బాహ్యప్రపంచంలోకి తీసుకురావడానికి.

"ఆఁ లోపలికిరా! కూర్చో!" యుద్ధంచేస్తూ వీరుడు ఇంకో మనిషితో మాట్లాడక తప్పనట్టుగా అన్నాడు.

కథానిక

"కూర్చోడానికి టైముందోలేదో - త్వరగా తేవాలి!"

"ఎక్కడికైనా ప్రోగ్రాం వుందా ఏమిటి?" ఉత్తరంమీదనుంచి కనీసం తలెత్తకుండానే తాపీగా అనేశాడు.

"మేటినీకి పోదాం"

"చాలా టైముంది. కార్పొరేషన్‌వాళ్ళు కరెంటు కట్టేస్తారు"

"ఏం ఏం?" గుడ్లుమిటకరించి ప్రశ్నించాను.

"ఏం ఏం? ఆ ప్రశ్న వాళ్ళనే అడుగు. పళ్లు రాలగొట్టేస్తారు."

"అదీ నిజమేలే! ఆఁ ఏమిటి అంతా కన్నుంచి అంతదీర్ఘంగా చదువుతున్నావు పరీక్షరోజున బడిపిల్లాడిలా!"

"ఇదుగో చదువు" నాకూ ఇచ్చాడు.

"ఇదేమిటి? నీ వుత్తరం నేం చదవడం?"

తల ఎగరేసి "చదువు చెపుతాగా" అన్నాడు. పూర్తిగా చదివాను. విశేషం ఏమీలేదు. ఎవరో స్నేహితుడు డబ్బుపంపుతూ రాశాడు. కాకపోతే ఆ ఉత్తరం ఎవరో "రచయిత" రాసినట్టుగా వుంది. చేతికిచ్చేశాను.

"రాసిందెవరో తెలుసా?"

"ఊహుఁ తెలీదు. దానివల్ల వచ్చినవష్టం ఏమీ లేదుగాని ఇప్పుడు దాన్నిగురించి చెపుతూ అతగాడెవరో అర్థంచెయ్యడానికి ప్రయత్నం చెయ్యకు నీకు పుణ్యముంటుంది. నాప్రాణంతీసి మరీ నీ

తిరునగర్

ప్రాణం తీసుకున్నంత పనవుతుంది."

"సూర్యంలేడూ - అదేరా - మొన్న గురువారంనాడు నాటకంవేశాడు..."

"ఓ! అతనూ నువ్వూకలిసి చదువుకున్నారని కూడా చెప్పావు?"

"ఆ! అవును వాడే ఎలారాశాడో చూడు" చదవసాగాను ఒక్కొక్క వాక్యాన్ని స్పష్టం చేస్తూ.

మునిస్వామికి—

ఇవిగో నీ కివ్వవలసిన పాతిక రూపాయలు పంపుతున్నాను మనియార్డరు ద్వారా. నీ వంత ఇదిగా వుత్తరం రాసినందుకు బాధపడ్డా ననుకోకు. నీ పరిస్థితుల్ని అర్థం చేసుకోలేనంత అవివేకిని కాదు. నీ అవుసరం ఎలాంటిదో! పరిస్థితులు బాగా వుండక ఆలస్యం చెయ్యవలసి వచ్చింది. అందుకు ఈ అకృతాత్ముణ్ణి క్షమించమని మన చిన్ననాటి స్నేహాన్ని పురస్కరించుకుని అడుగుతున్నాను. ఈ సమయంలో నువ్వుగనక ఇంతటి వ్యవధినైనా క్షమించగలిగావు. నీవు నామీద అంత నిశితంగా విమర్శించినందుకు నాకేమీ బాధలేదు. దానికి కారణం నా వ్యక్తిత్వంమీద నాకే నమ్మకం లేనుగనుక. వుంటాను.

ఇట్లు,
నీకు బహుశా మిత్రపాత్రుణ్ణి
సూర్యం.

"చూశావా ఎంత ఇదిగా రాశాడో వుత్తరం? ఈ వుత్తరంతో పాటు మనియార్డరు కూడా పంపాడు పాతిక రూపాయలు. నిజానికి సూర్యనారాయణకి కాస్త ఘాటుగానే వుత్తరంరాశాను. గాని అది అంత తీవ్రంగా అతనిమీద పని చేస్తుందనుకోలేను."

కొంచెంసేపు మెదలకుండా వూరుకున్నాడు మునిస్వామి ఏదో ఆలోచిస్తూ, వాడి ముఖంలో నిజంగా తను చేసినపనికి చాలా బాధపడుతున్నట్లుగానే కనిపిస్తోంది. "నేనుమాత్రం ఏం చెయ్యగలను? సంసార భారం నెత్తినపడి ఆర్థిక దుస్థితిలో చచ్చిపోతున్నాను గుమస్తాగిరితో సంసారం సాగక 'ఆర్థిక దుస్థితి ముందు కూడా స్నేహానికి విలువ ఏమీ మారదు' అని నే చదువుకొనే రోజుల్లో అనుకునేవాణ్ణి! ప్చ్!"

"ఇప్పుడు దానికే మొచ్చింది?" మెదలకుండా వూరుకోలేక అడిగాను.

"అది శుద్ధ తప్పని స్థిరీకరించుకోవలసివచ్చింది. ఆ చచ్చు పాత భావాన్ని మార్చుకోవలసి వచ్చింది" వాడి కోపాన్నంతా మాటలద్వారా వ్యక్తం చేస్తున్నాడు. "నిజానికి సూర్యానికీ నాకూ వున్న సంబంధాన్నిబట్టి అతన్నంతగా ఆడగ్గూడదు వెధవ పాతికరూపాయల భాగ్యానికి. కాని పరిస్థితుల ప్రభావంవల్ల మానవుడు ఏ పని చెయ్యడు? ఉత్తరం రాసేప్పుడు సూర్యానికి నా పరిస్థితులన్నీ సమన్వయం చేసుకుని ఉద్రేకంగా నే రాశాను. ఇప్పుడు నేనంత కఠినంగా ఉత్తరం రాయడం సమంజసం కాదేమోనని బాధగా వుంది."

"ఏడవలేకపోయావా భోరున- ఆబాధ కాస్తా తగ్గిపోయేది. డబ్బు రావలసివుంటే ఎవడూరుకుంటాడోయ్?"

"ఆ లెక్కకొస్తే సూర్యం డబ్బు నే నెంత వాడుకోలేదు? నా డబ్బు సూర్యం ఎంత వాడుకోలేదు? కాని అది ఓ దశ! ఆ దశ మారిపోయింది. ఈనాడు ఒకరి పరిస్థితులు ఒకరు అర్థం చేసుకొనే ఇతరుల పరిస్థితులకు సానుభూతి చూపించలేని రోజులు వచ్చాయి. తన దుస్థితి గురించే తను ఏడవలేక చస్తూవుంటే ఎదుటివాటి బాధలు గమనించే సహనం, గమనించి త్యాగం చెయ్యగల దైవత్వం లేదుమరి!"

మునస్వామి తను చేసిన పదవిని సమర్థించుకోడానికి ప్రయత్నం చేస్తున్నాడట్లే వుంది.

"నే నతని బాగోగుల్ని స్థితిగతులనీ గురించి ఆలోచిస్తూ కూర్చుంటే నేనేం కావాలి ముందు? అసలు ప్రకృతి లక్షణం ఎవరు తీసెయ్యగలరు? సూర్యనారాయణ పాపం చాలా కష్టాల్లోనే వున్నాడు. ఆ సంగతి నా కూడా తెలుసు. కాని నా తాహతుకు నే చెయ్యగలిగింది మనసులో జాలిపడడమే. మానవజీవిత సంఘర్షణలో సానుభూతి, జాలి మొదలైన లక్షణాలన్నీ వున్న వ్యక్తి కాలపరిణామాలకి వాతావరణం సరిపడక ఉక్కిరిబిక్కిరయి చచ్చి వూరుకోవలసిందే! ఏదో నేను నా సిద్ధాంతాల ప్రకారం నడుస్తాను. నాకా ఆత్మసంతృప్తి వుంటే చాలు అనుకోవడం కేవలం

ఏం చెయ్యలేని పిరికివాడు తనకుతాను సమాధానం చెప్పుకున్నట్టే వుంటుంది. అది పట్టి ఆత్మవంచనే అవుతుందేమో."

"ఏమిటోరా! నిన్న పోస్టుమాన్ వచ్చి మనియార్డరూ, ఉత్తరమూ ఇచ్చిపోయిన దగ్గిరనుంచి ఒకటే పీకుతోంది మనసులో. అసలు సూర్యనారాయణ డబ్బు మనియార్డరు ద్వారా పంపవలసిన అవుసరంలేదు. ఈ వూళ్లోనేవుంటున్నాడు. నాకు వాడిముఖాన వెళ్ళి అడగడానికి ముఖం చెల్లక వుత్తరం రాశాను. పాపం వాడికీ ముఖం చెల్లలేదు గాబోలు- మనియార్డరు ద్వారా డబ్బు పంపాడు. డబ్బు ఏమిటో నీచంగా కనిపిస్తోంది వెధవ డబ్బుకోసమేగా బాల్యంనుంచీ ప్రఘాఢంగా పెరిగిపోయిన స్నేహం సహితం లెక్కలేకుండా పోయింది? సూర్యనారాయణ నాకోసమే ఇలాటి పాతికలు ఎన్ని ఖర్చు చేశాడో ఒకనాడు!"

నాకు విసుగ్గావుంది వెధవ గొడవ. మానవుల్లో పెద్దలోపమే ఇది. ఎవరిగొడవ వాడిదేనాయె! ఏమీ తోచక ఇక్కడికివస్తే బాగానే వుంది! లేచి రెండడుగులువేసి స్విచ్, ఆన్ చేశాను. లైటు వెలగలేదు. "ఇంకా కరెంటు రాలేదే మంచి మేటనీగూడాను."

"వెధవ మేటనీ, ఇంకా ఆ గొడవలోనే వున్నావన్నమాట. నిజంగా సూర్యనారాయణ జీవితంచూస్తే ఓ సినిమాలాగానే వుంటుందోయ్! వాళ్ళనాన్న రామనాథంగారు తాసిల్దారు వుద్యోగం చేస్తున్నప్పుడు అతనూ నేనూ ప్రపంచమంటే లెక్కలేకుండా తిరిగాం! సినిమాలు క్లబ్బులు ఒకటేమిటి? సూర్యం నాటకాల్లో వేషాలు వేసేవాడు. వాడికి చిన్నతనంనుంచీ నాటకాలంటే పిచ్చెక్కువ. దానికితోడు శ్రీమంతుడి బిడ్డడు. స్వయంగా నాటకాలు ఆడించేవాడు.

"అతనిప్పటికివుల్లే అకించనుడిగా బ్రతికినవాడూగాదు. పెరిగినవాడూగాదు. అసలు సూర్యనారాయణకి బాల్యజీవితమే జీవితానికి ప్రగతేమోననిపిస్తుంది. జీవితం అధిగమించిన కొద్దీ అతను అధోభువనానికి పోతున్నాడు."

"ఓడలు బళ్ళవటానికీ, బళ్లు ఓడలవడానికీ కాలచక్రానికి అడ్డులేదు. అది దానికీ-దీనికీమధ్య ఆట్టే పెద్ద వ్యవధివుంచదు గూడాను. అల్లాగే అదృష్టచక్రానికి అదో భాగంలోవున్న సూర్యనారాయణ జీవితానికి మళ్ళా కాలచక్ర అధిగమనంలో ఇంకో ప్రగతిని ఆశిద్దాం! అది సంశయాస్పదమైంది. కాని ఆ కాలచక్రంలోనే అతని తండ్రి రామనాథం, కుటుంబం యావత్తూ ఒక్కసారి హిమాలయ శిఖరాగ్రంనుంచి క్రిందికి పడిపోయింది. రామనాథంగారు ఉద్యోగరీత్యా బాగా సంపాదించారని పేరు! అలా సంపాదించనివాళ్లెవరు? కాని అదృష్టచక్రం కాలచక్రానికి ఎదురై ఒకదానికొకటి రాసుకొని రామనాథం జీవితాన్ని కాలచక్రంలో అంతర్భూతం చేశాయి. అంతే రామనాథం మళ్లా ఊరూ పేరూ లేకుండా పోయాడు. ఏదో కాస్త సంపాదించాడని ఉద్యోగము ఊడిపోయింది.

జీవితపు మొదటిమెట్టునుంచి సాఫీగా వున్న దారి కొంతదూరం నడిచేసరికి హఠాత్తుగా నడవలేనంత కఠినంగా మారిపోయింది సూర్యనారాయణకి. ఆ వజ్రాఘాతానికి రామనాథం గనుక తట్టుకోగలిగి ఇంకా జీవించగలుగుతున్నాడుగాని ఇంకొకడైతే ఒడుదుడుకుల్లేని మార్గాన్ని దాటగానే అమాంతం అక్కణ్ణించిపడిపోయి నామరూపాలు లేకుండా కాలగర్భంలో కలిసిపోయేవాడే!

ఉద్యోగం ఊడిపోయినరోజూ గడిచేవిధంగానే కొంతకాలం గడిచింది ఇల్లు. అవి చాలా తక్కువరోజులు. తరువాత పరిస్థితులు తప్పనిసరిగా మార్చుకోవలసి వచ్చింది. రామనాథంగారికీ, ఆయన తన జీవితక్రమాన్ని మార్చుకొని పాత కార్యక్రమాన్ని చింపి పారేసి ఇంకో క్రొత్త కార్యక్రమాన్ని క్రొత్త కాగితంమీద రాసుకున్నారు. గాని అంత తేలికగా సూర్యనారాయణ మాత్రం ఆ జీవిత మార్గాన్నించి తప్పుకొని ఇంకోదారి చూచుకోలేకపోయాడు. దానికి సూర్యాన్ని ఏమీ అనలేం! రామనాథం తనజీవితపద్ధతి మార్చుకోగలగడానికి; అతనికా పాతవిధానం పుట్టినప్పట్నించీ నిర్దుష్టమైందిగాదు. ఎక్కడో ఊరూ పేరూ లేనిచోటు జన్మించాడు. అదృష్టం కలిసివచ్చింది. అంతటివాడయాడు. మళ్ళా అది వెనకకు తిరిగింది. స్థితి మొదటికే వచ్చింది. అందుచేత అతనెంత బాధపడినా

మళ్ళాతను ప్రథమస్థానానికే వచ్చాననే అనుకోవడంతప్ప అంతకంటె ఎక్కువబాధపడడు. కాని సూర్యనారాయణ పరిస్థితి భిన్నమైంది. పుట్టడం ఐశ్వర్యంలో పుట్టాడు; ఐశ్వర్యంలో పెరిగాడు. దానికి ప్రఘాఢంగా హత్తుకుపోయాడు. ఇప్పుడు తను తనతండ్రికిమల్లే పరిస్థితుల్ని అనుభవించమంటే తేలిగ్గా అయ్యేపనిగాదు.

నెలకు స్వంతఖర్చుకిచ్చే నలభైరూపాయలూ ఇప్పుడు ఇవ్వడంలేదు. అటువంటి సమయంలో నేను ధైర్యంచెప్పేవాణ్ణి! కావాలంటే నాడబ్బువాడుకోడానికేమీ సందేహపడవద్దని చెప్పేవాణ్ణి! చచ్చినా ఒప్పుకోనేవాడుగాదు. పత్రికలకు కథలు రాస్తూవుండేవాడు. అప్పుడప్పుడూ ఏదన్నావస్తూ వుండేది.

చదువుఇంటర్‌పూర్తిచెయ్యకుండానేమానేసినా నాటకాలుమాత్రం మానలేదు. ఇంతవరకూ తండ్రి సూర్యం విషయంలో పెద్దగా జోక్యం కలిగించుకోలేదు. కాని సూర్యం నాటకాల్లో పడిపోయి రాత్రిళ్లు ఇంటికి రావడమే మానేశాడు. ఎవరో డ్రామానటి ఇంట్లో వుంటున్నాడని విన్నప్పుడు మాత్రం రామనాథంగారు మెదలకుండా వూరుకోలేక పోయారు.

"నువ్విలా భ్రష్టుడివైపోతా వనుకోలేదు" అన్నాడు. సూర్యనారాయణ ఏమీ మాట్లాడకుండా తలవంచుకొని వెళ్ళిపోయాడు. తరువాత ఆయన, నన్ను పిలిచి వాడితో చెప్పిచూడమని చెప్పారు. నేను వాణ్ణి నిలదీసి అడిగాను"నువ్విలా ఎందుకు చేస్తున్నావు?"

"మునిస్వామీ!ఇంతకాలం మనిద్దరం స్నేహం చేశాం! నన్ను నువ్వు అర్థం చేసుకోలేదంటే నాకు బాధగా వుంది. నా స్థానంలోనే నువ్వు వుంటే అప్పుడు తెలిసేది. ఏంచెయ్యను? ఏ క్షణం కాస్త ఏకాంతంగావున్నా భరించలేనంత ఆవేదనగా వుంటుంది. దాన్ని మర్చిపోవడానికి మార్గం చూచుకున్నాను. అది తప్పంటావా?" అన్నాడు.

ఏం సమాధానం చెప్పను? ఏదో చెపుదామని వచ్చాను గనుక విధిప్రకారం "నీకు ప్రేమంటే నమ్మకముందా-అయినా ఆ అమ్మాయికి ప్రేమేమిటి?" అన్నాను.

"ఆ విషయం నాకూ తెలుసు! అసలీ ప్రపంచంలో దేంట్లో సత్యం వుంది చెప్పు. నువ్వు కాలేజీలో చదివిన చదువుల్లో అర్థం, సత్యం చెప్పు? ఎందుకు చదివావు అన్ని శాస్త్రాలు?"

"అవన్నీవట్టివని ప్రతివాడికీతెలుసు. కాని మెదడుకు ఏదోపని వుండాలి. దానికోసం ఇవన్నీను. ఏదో ఒక దారివెంట నడిపించడానికివన్నీను. అంతే!" అన్నాడు సూర్యం.

ఒక్కగానుఒక్కకొడుకు చెడిపోతున్నాడంటే ఏ పితృహృదయం సహిస్తుంది? పాపం రామనాథంగారుగూడా భవిష్యత్ జీవితాన్నంతటినీ సూర్యంమీదనే ఆశ పెట్టుకొని వున్నారు. తను పూర్వంఉండే రెండంతస్థుల మేడ అద్దెకిచ్చి తను క్రిందభాగంలో ఒక పోర్షన్‌లో కాపురం ఉంటున్నాడు. పొలంమీదవచ్చే ధాన్యం ఇంట్లోకి సరిపోతుంది. తనకి చివరికి మిగిలింది అది. కొడుకు స్థితిచూచి అప్పయినాచేసి వివాహం చెయ్యాలనే నిశ్చయానికొచ్చాడు. ఇదివరకు వచ్చినన్ని సంబంధాలు ఇప్పుడు రావడంలేదు. ఇదివరకు ప్రతివారూ వచ్చి తెగతెని "మాపిల్లనిస్తామంటే మాపిల్లనిస్తామనేవాడు" అతనేమిటి? తాసిల్దారుకొడుకు! ఇప్పుడో అతనేమిటి? దమ్మిడీ లేని అగతిగుడు; ముండల మురాకోరు.

కాని రామనాథంగారు తెలివి తక్కువవారేమీగాదు. దూరపుసంబంధాన్ని ఒకటి కుదుర్చుకొని వ్యవధిలేకుండా పెళ్ళిచేసేశారు. సూర్యం నిజానికి ఆ పెళ్ళికి తన ఇష్టం ఏమాత్రమూ తెలియపర్చలేదు. పెళ్ళికి ఆడ్రామా నటికూడా వచ్చింది.

పెళ్లయిన రెండోరోజున సూర్యం ఆ డ్రామానటి ఇంట్లో కనిపించలేదు. ఎక్కడికి వెళ్ళిపోయాడో ఎవరికీ తెలీదు. ఇదంతా తెలిసి నూతన వధువు కుమిలిపోయింది. ఆ మరునాటి తెల్లవారేసరికి రామనాథంగారి దొడ్లో నూతిలో పెళ్ళికూతురిశవం కనిపించింది. రామనాథంగారి చేతికి బేడీలు పడేవేగాని ఏ భగవంతునిదయవల్లో తప్పిపోయింది. అయినా తాను చేసినపనికి అనుతాపంతో కృంగిపోయాడు. తను మాత్రం ఏంచేశాడు? తను తలంచిందొకటి-దైవం తలించిందొకటి.

తరువాత కొన్నిరోజులకి నాకు ఉద్యోగం

బదిలీఅయి ఈవూరు వచ్చాను. ఒకనాడు హఠాత్తుగా ఈవూళ్ళో కనిపించాడు సూర్యం.

"ఎంతకాలంనుంచి ఇక్కడుంటున్నావు?" అన్నాడు నన్ను. "నాసంగతేమిటిలే! నువ్వెంత కాలంనించి?" అన్నాను నేను.

"ఆఁ మొన్నటినుంచే..."

రామనాథంగారికి ఉత్తరం రాశాను సూర్యం ఈవూళ్లో వుంటున్నాడని. ఆయన తనకేమీ సంబంధంలేదని తిరిగి ఉత్తరంరాశాడు. ఆయనకు సూర్యంమీద పూర్తిగా విరక్తి జనించిందన్న మాట.

అప్పట్నుంచీ ఆ అమ్మాయితోనే కాలంగడుపుతున్నాడు. నాటకాలుమాత్రం మానలేదు.

ఒకరోజు నాదగ్గరికివచ్చి తనకు ప్రాణంమీదికి వచ్చిందనీ ఒక్కపాతిక రూపాయలుంటే ఇవ్వమనీ ప్రాధేయపడ్డాడు. రేపు కాదుగదా రెండు నెలలు గడిచిపోయింది. ఇవ్వనేలేదు. నాకు గట్టిగా అవసరమొచ్చినప్పుడల్లా అడుగుతూనే వున్నాను. కాని మొన్నటిసారి మాత్రం కోపం వచ్చి వుత్తరం రాశాను. ఇదుగో మళ్ళా ఇలా వుత్తరం రాస్తూ డబ్బు ఇంపించేశాడు. కాని... మునిస్వామి ఏదో చెప్పబోయాడు. పైన లైటు వెలిగింది.

"ఆ! కరెంటు వచ్చింది ఫరవాలేదు. నాలు గుంబావే అయ్యింది. మేటన్నీ వేస్తార్లే! లే!" అన్నాను వాడిమాటకి అడ్డంవస్తూ.

నేను వాడు చెప్పతున్నదానికి అట్టే ప్రాముఖ్యం ఇవ్వకపోవడం గమనించి మళ్ళా ఏమీ చెప్పలేదు. లేచి బయలుదేరాడు సినిమాకి.

ఆదివారం గడిచిపోయింది. మళ్ళా ఆదివారం వచ్చేసింది. ఎమిటో కాలం వేగంగా అతిక్రమిస్తోంది.

మునిస్వామి ఇంటికి వెళ్లి "మునిస్వామీ" అన్నాను.

తలుపుతీసి మావాడి సతీమణి వచ్చింది. "రా అన్నయ్యా! లోపలికిరా. వారు ప్రొద్దున్నే ఊరెళ్లారు. ఎవరో సూర్యనారాయణ అనే స్నేహితుడు బెజవాడలో రైలుకిందపడి చచ్చిపోయాడుట. వాళ్లనాన్న పాపం ఏడుస్తూ వచ్చారు. ఇద్దరూ కలిసి ఆదరాబాదరా పరుగెత్తుకుంటూ వెళ్ళారు" అంది.

నాకు కళ్లు తిరిగిపోయాయి. ఏమిటి? సూర్యనారాయణ రైలుక్రిందపడి చనిపోయాడా? ఛా! వెధవ ఆదివారం మొన్న ఆదివారంగూడా ఇలాగే వుంది! అయినా సూర్యనారాయణ ఎందుకు చనిపోయినట్లు?" ఈ ప్రశ్న నాకేం సమాధానమిస్తుంది? వెళ్లిన మునిస్వామి రావాలి.

వచ్చాడు రెండోరోజు అప్పటికే దహన సంస్కారం అయిపోయిందిట. "ఎందుకు చచ్చిపోయాడంటావు అతను?" అన్నాను మావాణ్ణి. వాడు ఓ ఉత్తరం నాచేతికిచ్చాడు సమాధానంగా అది మొన్న సూర్యం రాసిన రాతలాగేవుంది.

మునిస్వామీ—

చిన్నతనంలో అన్ని విషయాలూ నీతోనే చెప్పేవాణ్ణి! నిజానికి నా జీవితానికి సానుభూతి చూపించిన వాడివి నువ్వొక్కడవే మిగిలావు. పుట్టినప్పట్నుంచీ జీవితం అశిక్షిత మార్గంలోనే గడిచిపోయింది. పరిస్థితులు హఠాత్తుగా మారిపోయి అధిగమించే శక్తి లేకపోయింది.

ప్రపంచంలో పుట్టిన ప్రతి ప్రాణీ సేచమైందే. దేనిలోనూ నిజాయతీ, న్యాయం లేవు. అసలు ప్రపంచపుతీరే అంతే నేమో! కుమారికోసం నేనంత త్యాగంచేసానో నాకేతెలుసు. చేసుకున్న భార్యను సహితం చేతులారా హత్యచేశాను కాని కుమారి ఇంకెవరితోనో లేచిపోయిందంటే మానవత్వంమీద నాకింకా నమ్మకం వుంటుందా ఇది మచ్చుకు ఉదాహరణగా చెప్పాను. ఇటువంటివి ప్రపంచంలో ఎన్నో. బ్రతకాలంటే ఎన్నో అపమార్గాలు త్రొక్కాలి. కాని అవి బయటికి తెలీనీకూడదు. కృత్రిమంగా జీవించాలి. స్వార్థం మానవులలో బలిసిపోయింది. మానాన్న పెద్ద ఉద్యోగం చేస్తున్నప్పుడు ప్రతివాళ్ళూ వచ్చి తెగ తినేవారు. ఈనాడు ఆయనకు ఎవరైనా ఒక్క కానీ ఇస్తున్నారా? లేదు. మానవులు ఎంత స్వార్థపరులో ఆలోచించు. సంఘమంటే నాకసహ్యం. మానవజన్మంటే నేరోత! అవన్నీ మర్చిపోదానికే నేనింతవరకూ ఏపనిచేసినాను దానికే అంతం అంటూవుంది. ఎందుకు బ్రతకాలో అర్థంకావడం లేదు.

ఈ కుళ్ళు ప్రపంచంతో చేతులుకలిపి బ్రతకడం నాకుచేతకాదు. చేతులుకలపకపోతే బ్రతక

లేదు మనిషి. అలా జీవించినవాడే జీవితంలో గెలుపొందినవాడు. నాకటువంటి గెలుపు అవుసరం లేదు. అందుచేతే శాశ్వతంగా ఇక్కణ్ణించి వెళ్ళి పోతున్నాను. భగవంతుడంటూ వుంటే పునర్జన్మం అంటూ వుంటే భగవంతుణ్ణి పునర్జన్మింప చేయొద్దని ప్రార్థిస్తాను. దానికతనంగీకరింపకపోతే కనీసం మానవజన్మనైనా ఇవ్వవద్దని ప్రార్థిస్తాను. దానికంటే ఏ అడివిలో చెట్టుగానో పుట్టిస్తే అదే మేలు. మిత్రుడిమీద ఏ కాస్త అభిమానమున్నా వుంటే- నావల్ల మా నాన్నకు దుఃఖం కలగకుండా చూడు- వుంటాను.

— సూర్యం.

"హాఁ!" దీర్ఘంగా నిట్టూర్చాను.

"ఉత్తరం ఇవ్వాళ ప్రొద్దున్నే వచ్చింది. బెజవాడనించి. అంటే చచ్చిపోయేముందు వేశాడన్న మాట. పాపం, ఆ ముసలాయన ఇంకా ఎంతో కాలం బ్రతకడు" అన్నాడు మునిస్వామి దిగులుగా సూర్యం నాన్న సంగతి కాబోలు.

"పాపం, అసమర్థుడు! జీవితంలో అపజయం పొంది ఆ విధంగా నికృష్టపు చావు చచ్చాడు" అన్నాను నేను. మునిస్వామి అందుకొని-

"వాడుగాదు అసమర్థుడు, మనం. అటు చచ్చి పోనూ లేము...ఇటు బ్రతకనూ లేము" అన్నాడు.

అదీ నిజమేమరి!

---

కథానిక

# అమ్మా - నాన్నా

టి. వి. రత్నావళి

"ఇదేమిటండీ! ఇలా పుచ్చు వంకాయలు తెచ్చారూ? అన్నీ పుచ్చులే! మీకెలా తోస్తుందో యిలాంటివన్నీ తేవాలని? ఎక్కడా చెల్లకపోతే మీకంటకడతారా పుచ్చువంకాయలన్నీను. మీలాంటివాళ్లు లేకపోతే వాళ్లెలా బాగుపడతారూ? ఏపని చూద్దామన్నా అన్నీ అవకతవక పనులేగదా! ఇంతకీ మిమ్మల్నని ఏం ప్రయోజనం! నా ఖర్మం అలా వుంటే! బోలెడు డబ్బును పెట్టారు. సరకులా చెల్లవాయె! నిన్న తెచ్చిన దోసకాయలన్నీ చేదు విషాలుగదా! ఇలా నోట పెట్టలేకపోయాం. రానురాను...!" అని శతకం ప్రారంభించింది పార్వతమ్మ.

"అయిందా చదవడం...? ఇంకా వుందా? అయితే నువ్వేమైనా కాయల్లో దూరి చూస్తావేమిటి నాకంటేమహా! కబుర్లు చెప్పడం కాదు వంటింట్లో కూర్చుని!" అని సమాధానం చెప్పి, సమర్థించుకోవాలని చూశాడు పార్వతమ్మ భర్త పరమేశ్వరరావు.

"ఔనౌను! అలా కడుపులో దూరి చూడలేక పోబట్టే మీలాటి వాళ్ళ పాలబడ్డాను. మానాన్నకే అంత తెలివుంటే నాకీ ప్రారబ్ధమేమి?" అంటూ ఆ తరిగిన వంకాయలన్నీ నాన్న చూస్తూండగా కుడితితొట్టిలో పోసేసింది. అనవసరంగా సంభాషణ పెరిగిపోతుందని నాన్న పైన ఖండువా వేసుకుని బయటికి వెళ్ళిపోయాడు.

పాపం! అమ్మ నాన్నని ఎలా అనేసిందో! నాన్నేమీ మాట్లాడలేకపోయాడు. నాన్న ఏమనుకుంటాడు? అమ్మ ఎప్పుడూ ఇంతే! నన్నుకూడా అలాగే తిడుతూ ఉంటుంది. నిన్నను పుస్తకం పారేసానని ఎన్ని కొట్టిందో. నాన్న అమ్మకంటే పెద్దవాడుకదా! ఎందుకూరుకున్నాడు? అయినా నాన్న అన్నీ పుచ్చుకాయలే తెచ్చాడు. అమ్మేం చేస్తుంది? నిన్న దోసకాయ పప్పు చేదు విషమై పోయింది. అంతా గోతులో పోసేసింది. నాన్న ఎప్పుడు యింతే? అని ఆలోచిస్తూ బళ్లోకి అన్నం తిని వెళ్ళిపోయింది మణి.

మణీ మధుసూదను లిద్దరే పిల్లలు పరమేశ్వర రావుగారికి, మణి పదేళ్ళపిల్ల మధు ఏడేళ్ళపిల్లవాడు. మణి సాయంత్రం బళ్లోంచి యింటికొచ్చింది. కాస్సేపు ఆడుకుంది. అన్నం తిని పుస్తకాలు ముందరేసుకుని లాంతరు దగ్గిరగా కూర్చుంది. పేజీలు పరుగెట్టినా ధ్యానం